విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

మంగళవారం 27 మే 2025 8 పేజీలు

ఘాటెక్కిన 'పొగాకు'

- మద్దతు ధరలపై గళమెత్తుతున్న రాజకీయ పార్టీలు
- రేపు పొదిలి వేలం కేంద్రాన్ని పరిశీలించనున్న జగన్
- రైతులతో ముఖాముఖి
- ఏర్పాట్లను పరిశీలిస్తున్న 'బూచేపల్లి'

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : జిల్లాలో పొగాకు రైతులు గిట్టుబాటు ధర కోసం రోడ్లెక్కి ఆందోళన చేస్తున్న విషయం విధితమే. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని గత కొన్ని రోజులుగా వైసీపీ, సీపీఐ, సీపీఎం ఇతర రాజకీయ పార్టీలు రైతులకు మద్దతుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నారు. అయినప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదు. వ్యాపారస్తులు కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధర రానివ్వకుండా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు పొగాకు బేళ్లను రోడ్ల మీదకు తీసుకొచ్చి వాటిని తగలబెట్టి మరీ నిరసనలు వ్యక్తం చేసిన సందర్భాలు జిల్లాలో అనేకం చోటు చేసుకున్నాయి. వీటితో పాటు బర్లీ పొగాకు రైతుల సమస్య కూడా ఇటీవల కాలంలో జఠిలంగా మారిన విషయం విధితమే. దీనిపై తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు, జిల్లాకు చెందిన మంత్రి గొట్టిపాటి రవి, డోల బాలవీరాంజనేయస్వామి సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి పొగాకు రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేయాలని ఇటీవల పొగాకు వ్యాపారస్తులు అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కూడా జిల్లాలో పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించారు. రైతులకు అండగా నిలబడాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 28వ తేదీన జిల్లాలోని

మిగతా 2 లో ...

'విశాఖ ఉక్కు'ను ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోము..

- హెచ్చరించిన కార్మిక నేతలు...
- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

విశాలాంధ్ర-ఒంగోలు : విశాఖ ఉక్కును రక్షించాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం స్థానిక కాలెక్టరేట్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఏఐఎఫ్.టియు న్యూ జిల్లా కార్యదర్శి ఎమ్మెస్ సాయి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విధానాల ప్రమాదకరంగా ఉన్నాయని దుయ్యబట్టారు. ఒకపక్క విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని చెబుతూనే దొడ్డి దారిన ప్రైవేటీకరించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు విమర్శించారు.

శిథిలావస్థలో వంతెనలు 3లో

జులై 23న అద్దంకి పట్టణంలో సీపీఐ జిల్లా మహాసభలు

జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : జులై 23వ తారీఖున అద్దంకి పట్టణంలో జరిగే సీపీఐ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం జిల్లా కౌన్సిల్ సమావేశం షేక్ కాలేషా ఖాదర్‌బాషా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ సీపీఐ 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేసి సమాజంలో ఉన్న కూలీలు కర్షకులు కార్మికులలు, పేదల సమస్యల పరిష్కారం కోసం రెట్టింపు అయిన ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. సింగరకొండ మాట్లాడుతూ జూన్ నెల చివరి నాటికి గ్రామ శాఖ మహాసభ, మండల శాఖ మహాసభలు జులై 15వ తేదీలోపు నియోజకవర్గ మహాసభలు పూర్తి చేసుకోవాలని చెప్పారు. జూలై 23న జరిగే జిల్లా మహాసభలకు సమిష్టిగా అద్దంకి పట్టణంలో వైభవంగా జరిపేందుకు సిద్ధపడాలని కోరారు. ఆగస్టు 23,24,25 తేదీల్లో ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలకు బాపట్ల జిల్లా నుంచి అధిక సంఖ్యలో ర్యాలీకి బహిరంగ సభకు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని

మిగతా 2 లో ...

పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : మద్దిపాడు మండలం మల్లవరం గ్రామంలో గుండ్లకమ్మ నదిపై నిర్మించిన ప్రాజెక్టు రిజర్వాయర్ పక్కనే ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి మందిర ప్రాంతంలో 'యోగాంధ్ర - 2025'లో భాగంగా జిల్లా యంత్రాంగం ఇక్కడ యోగాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, స్థానిక శాసనసభ్యులు .బి.ఎన్.విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని యోగాసనాలు వేసి ప్రజల్లో స్ఫూర్తిని నింపారు. ఈ యోగాభ్యాసన కార్యక్రమంలో 400 మందికిపైగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్వాస మీద ధ్యాస ఉంచి మనసును, తనువును ఏకం చేసే ప్రక్రియే యోగాభ్యాసనం అన్నారు. ఒత్తిడితో కూడిన నేటి ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతితో మమేకం అవుతూ యోగా సాధనే దీనికి ఉత్తమ మార్గం అని ఆమె తెలిపారు. యోగా వలన కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ, ప్రజల్లో దీని పట్ల మరింత ఆసక్తి పెంచేలా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఇందులో భాగంగా ప్రజలకు శిక్షణ ఇచ్చేందుకు మాస్టర్ ట్రైనర్లను గుర్తించి వారికి కూడా ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. స్థానిక శాసనసభ్యులు మాట్లాడుతూ సంతోషం, ఆరోగ్యం, సంపన్నవంతమైన సమాజ ఆవిష్కరణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. యోగాభ్యాసనం ఇందులో ఒక భాగం అని తెలిపారు. యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా నెల రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. జూన్ 21వ తేదీన జిల్లాలో 10 లక్షల మంది యోగాసనాలలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో కిరణ్ కుమార్, డి.ఎం.హెచ్.ఓ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందజేయాలి

అధికారులకు ఏపీ రైతు సంఘం నేతల వినతి

విశాలాంధ్ర -ఒంగోలు : ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు విత్తనాలు, వ్యవసాయ యంత్రాలు, సూక్ష్మ పోషకాలు, పచ్చి రొట్టె విత్తనాలు అందించాలి ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వడ్డే హనుమారెడ్డి, కే వీరారెడ్డి అధికారులను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. హనుమారెడ్డి, వీరారెడ్డి మాట్లాడుతూ జూన్ మొదటి వారం నుండి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందన్నారు. పంటల వారీగా జిల్లాలో ఇప్పటివరకు సాగు ప్రణాళికలు, క్రెడిట్ ప్రణాళికలు, విత్తన ప్రణాళికలు అధికారులు ప్రకటించలేదన్నారు. సబ్సిడీ విత్తనాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు అన్నారు. జిల్లాలో 90 శాతం వ్యవసాయం కౌలు రైతులే చేస్తున్నారన్నారు. వీరికి ఇప్పటివరకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వలేదని, గ్రామసభలు నిర్వహించలేదన్నారు. దీంతో కౌలురైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో అన్ని రకాల విత్తనాల ధరలు విపరీతంగా పెరిగాయి అన్నారు. విత్తనాల ధరలు పెరగటంతో పాటుగా నాణ్యతలేని నకిలీ విత్తనాలు బహిరంగ మార్కెట్లో విచ్చలవిడిగా అమ్ముతున్నారు. చదువు లేని రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని వ్యాపారులు కల్తీ, నకిలీ విత్తనాలను అంటగడుతున్నారన్నారు. దీనివల్ల రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత సంవత్సరం ఇలాంటి ఘటనలు జిల్లాలో చాలా చోటు చేసుకున్నాయన్నారు. నాణ్యతలేని నకిలీ విత్తనాల అమ్ముతున్న షాపులపై అధికారులు ఎటువంటి దాడులు నిర్వహించడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. అన్ని రకాల పంటలు విత్తనాలను 90 శాతం సబ్సిడీతో చిన్న సన్న కారు రైతాంగానికి, కౌలు రైతులందరికీ అందజేయాలని డిమాండ్ చేశారు. పచ్చి రొట్టె విత్తనాలు, సాయిల్ టెస్ట్ ఆధారంగా సూక్ష్మ పోషకాలను సబ్సిడీపై రైతులకు అందజేయాలన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)

ఆరు నియోజకవర్గాలు మహాసభల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. జిల్లా కార్యదర్శి తస్నీరు సింగరకొండ అన్నీ నియోజక వర్గాల్లో జరిగే మహాసభలకు బాధ్యతలు వహిస్తారన్నారు. రేపల్లె నియోజకవర్గం బాధ్యతలు నంబూరి సత్యం, పడమటి బిక్షాలు, చీరాల నియోజకవర్గానికి చిరుమల ప్రకాష్ బాబు , బత్తుల శామ్యూల్, మేడ వెంకటరావు, అద్దంకి తుమ్మల పూర్ణ చంద్రశేఖర్ కెవిఎల్‌డి ప్రసాద్, షేక్ మహమ్మద్ ముస్తఫా, అద్దంకి నాగేశ్వరరావు బాపట్ల నియోజకవర్గం బక్క వెంకట రామకృష్ణారెడ్డి యాదగిరి శ్రీనివాసులు బాపట్ల నియోజకవర్గంలో ఉన్న జిల్లా కౌన్సిల్ సభ్యులు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. వేమూరు నియోజకవర్గానికి బందారు శ్రీనివాసరావు బావిరెడ్డి ప్రభాకర్ బాధ్యతలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రత్నకుమారి, మల్లెల ఏసోబు, మేకల వెంకయమ్మ, దొంతిబోయిన వెంకటేశ్వర్లరెడ్డి, కాగిత ప్రశాంత్‌రాజు, మేకల రమణయ్య, మేకల బిజిలిబాబు, దుండి కనకారెడ్డి, రాజా రెడ్డి, శ్రీనివాస రెడ్డి, ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, మేకల రమణయ్య, పొట్లూరి అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన 'పొగాకు'

(మొదటిపేజీ తరువాయి)

పొదిలి వేలం కేంద్రంలో రైతులతో మాట్లాడి వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకోనున్నారు. ఒక పక్క అధికార పార్టీ మరో పక్క ప్రతిపక్ష పార్టీలు పొగాకు రైతుల సమస్యలపై ఇరువురు స్పందించడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ నెల 27,28,29 మూడు రోజుల పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలందరూ మహానాడుకు తరలివెళుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలో వైసీపీ అధినేత జిల్లాలో పర్యటించనున్నారు. మొత్తం మీద పొగాకు రైతు సమస్యలపై వైసీపీ అధినేత రేపు జిల్లాకు రానున్న నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఏర్పాట్లను దగ్గరుండి చూస్తున్నారు.

కాకాణి గోవర్ధన్ రెడ్డి అరెస్టులో గోప్యం ఎందుకు..?

బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర- ఒంగోలు : ఎవరో ఇచ్చిన అబద్ధపు వాంగ్మూలం ఆధారంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమని వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేశామని పోలీసు ధృవీకరించారు. ఆదివారం మధ్యాహ్నం 2:00 గంటలకు గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేస్తే ఎక్కడ ఉంచారు, ఎక్కడికి తీసుకెళ్తున్నారు అన్న కనీస సమాచారం కూడా లేకుండా గోప్యంగా ఉంచడం చట్ట విరుద్ధమని మాజీ మంత్రిగా పనిచేసిన ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు కనీస సమాచారం ఇవ్వాలన్న బాధ్యత పోలీసు డిపార్ట్మెంట్ పై లేకపోవడం బాధ్యత రాహిత్యమేనని అన్నారు. ఈ రాష్ట్రంలో ఎప్పుడూ ఈ విధంగా అక్రమ కేసులు నమోదు చేయడం జరగలేదని, గతంలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదని, ఇది మంచి పద్ధతి కాదని దర్శి ఎమ్మెల్యే ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి పై పెట్టిన అక్రమ కేసు విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చట్టబద్ధంగా పోరాటం చేస్తుందన్నారు. ఈ కేసులో కాకాణి గోవర్ధన్ రెడ్డి క్లీన్ చిట్ తో బయటికి వస్తారని నమ్మకం తమకుందని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేడర్ మొత్తం కాకాణి గోవర్ధన్ రెడ్డి కి అండగా నిలుస్తుందనీ అన్నారు. ఈరోజు ప్రతిపక్ష పార్టీ నేతలు అధికార పార్టీ ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తున్నారన్న ఒకే ఒక్క కారణంతో వారిపై అక్రమ కేసులు పెట్టి ప్రజలను కూడా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇది అప్రజాస్వామ్యకం అని దర్శి ఎమ్మెల్యే ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు.

కడపలో మహానాడుకు సన్నద్ధం కావాలి

దేవదత్త పిలుపు

విశాలాంధ్ర-కనిగిరి : కడపలో జరగబోయే మహానాడుకు నియోజకవర్గ జన సమీకరణ పరిశీలకులుగా రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్టు సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్తను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక అమరావతి గ్రౌండ్ నందు శావల దేవదత్త ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27, 28 తేదీల్లో కడపలో జరిగే మహానాడును విజయవంతం చేయాలని నియోజకవర్గ టిడిపి మండల నాయకులకు అలాగే పార్టీ కార్యకర్తలకు అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ మహానాడు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు మహా పండుగ అన్నారు. 3 రోజుల పాటు జరిగే ఈ మహా పండుగకు అందరూ భారీగా తరలివచ్చి ఈ పండుగను విజయవంతం చేయాలన్నారు. అనంతరం జన సమీకరణ, ప్రయాణ సౌకర్యాలు తదితర ఏర్పాట్లు గురుంచి ఆయా మండల టిడిపి నాయకులతో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, అభిమానులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బ్లాక్ బర్లీ పొగాకు వేగంగా కొనుగోలు చేయాలి

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : బ్లాక్ బర్లీ పొగాకు పంటను కంపెనీలు వేగంగా కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం స్థానిక పిజిఆర్ఎస్ హాలులో జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పొగాకు కొనుగోలులో సమస్యల పరిష్కారం కొరకు పర్చూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పొగాకు రైతుల కొరకు టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు సంక్షోభంలో ఉన్నందున ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పొగాకు కొనుగోలుపై ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ ఉంటుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొగాకు కొనుగోలు తర్వాత పంట నిల్వ చేయడానికి అవసరమైన గోదాములు గుర్తించి, సిద్ధంగా ఉంచాలన్నారు. పొగాకు కొనుగోలు ముగిసే వరకు పొగాకు కంపెనీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో వీడియో, టెలి కాన్ఫరెన్స్‌లు నిరంతరాయంగా నిర్వహిస్తామన్నారు. మంత్రి సమక్షంలో జరిగిన ఒప్పందాల మేరకు పొగాకు కొనుగోలులు జరగాలన్నారు. అలాగే ధాన్యం సేకరణ వేగం పంజుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 33,200 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరగ్గా, ఇంకా 18 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందన్నారు.

కలెక్టరేట్లో పురుగుల మందు తాగిన బాధితురాలు

విశాలాంధ్ర -ఒంగోలు : రక్తసంబంధికులే తనను మోసం చేశారని, తన స్థలాన్ని తనకు ఇప్పించాలంటూ సౌభాగ్యమ్మ కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ వద్దకు పురుగుల మందు తాగి వచ్చారు. పరిస్థితిని గమనించిన అధికారులు స్పందించి, సౌభాగ్యమును చికిత్స నిమిత్తం వెంటనే ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. జిల్లాలోని త్రిపురాంతకం మండలం, గ్రామానికి చెందిన ఎరుకల కులానికి సంబంధించిన పేరం సౌభాగ్యమ్మ తన రక్త సంబంధీకులు అన్యాయం చేశారని, తన స్థలాన్ని అక్రమంగా రాయించుకున్నారని, తనకు న్యాయం చేయాలంటూ పలుమార్లు జిల్లా ఉన్నతాధికారి చుట్టూ తిరిగాయి. అధికారులు స్పందించడం లేదంటూ గతంలో రెండు పర్యాయాలు పురుగుల మందు తాగారు. ఒకసారి ఎస్పీ కార్యాలయం వద్ద, మరో మారు కలెక్టర్ కార్యాలయం వద్ద పురుగుల మందు తాగారు. తాజాగా సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అధికారులు నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో సౌభాగ్యమ్మ పురుగుల మందు తాగి అధికారుల వద్దకు విచ్చేశారు. సౌభాగ్యమ్మ పరిస్థితిని గమనించిన అధికారులు స్పందించి వెంటనే మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడం సరికాదు

జిల్లా జడ్పీటీసీ సంఘం అధ్యక్షులు గుంటక తిరుపతిరెడ్డి

విశాలాంధ్ర-వెలిగండ్ల : అధికారులు ప్రభుత్వ కార్యక్రమాల యందు ప్రోటోకాల్ పాటించాలని వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి అధికారులను కోరారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు వైస్ ఎంపీపీ డాక్టర్ ఎర్రబోయిన భారతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వం కార్యక్రమాలు యందు ఆయా పంచాయతీలో ఉన్న సర్పంచ్లను ఎంపీటీసీలను పిలవవలసిన బాధ్యత వారిపై ఉందని వారు ప్రజల చేత ప్రజల కొరకు ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను వారిని ప్రభుత్వ కార్యక్రమాల యందు ఎందుకు పిలవడం లేదని అన్నారు ప్రజా సమస్యలు ప్రతినిధులు దృష్టికి వస్తూ ఉంటాయని వాటిని సామరస్యంగా పరిష్కరించే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుందని అన్నారు ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రోటోకాల్ పాటించవలసిన బాధ్యత అధికారులదే అని ఆయన సూచించారు, ఐసిడిఎస్ మండలంలో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందో తెలియటం లేదని ప్రతి పంచాయతీలో సర్పంచులు ఎంపీటీసీలు ఉన్నందున వారికి సమాచారం అందిస్తే మరింత విస్తృతంగా ఐసిడిఎస్ పథకాలు ప్రజల్లోకి చేరుతాయని ఆయన అన్నారు, గత సమావేశంలో చర్చించిన సమస్యలను మరొక సమావేశం నాటికి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు అంతేకాక సమస్యలు యధావిధిగా ఉంటే చర్చించి ప్రయోజనం లేదని ఆయన అన్నారు.

శిథిలావస్థలో వంతెనలు

- భయాందోళనలో ప్రజలు
- అగమ్యగోచరంగా పుట్ట చెరువు పాలెం- పిడతల పూడి మధ్య బ్రిడ్జి
- గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరు
- నిర్మాణంలో ఇంకా జాప్యమే

పుట్ట చెరువు పాలెం- పిడతలపూడి మధ్య అద్వాన్నంగా బ్రిడ్జి

మర్రి చెట్ల పాలెం -అయ్యప్ప రాజు పాలెం మధ్య ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

విశాలాంధ్ర- చీమకుర్తి : చీమకుర్తి మండలంలో కాలం చెల్లి కూలడానికి సిద్ధంగా ఉన్న బ్రిడ్జిలు ప్రయాణికులను కలవర పెడుతున్నాయి. చీమకుర్తి కోనేని వారి పాలెం మధ్య బైపాస్‌కు దగ్గరగా ఉన్న ఎన్ఎస్పి కెనాల్ పై నిర్మించిన బ్రిడ్జి ఆ కాలువ నిర్మించి నప్పుడు ప్రయాణికులు కొరకు నిర్మించిన బ్రిడ్జి కాలం చెల్లి ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో ప్రయాణికులు భయపడుతున్నారు. ఈ బ్రిడ్జి మీదగా చీమకుర్తి మండల దక్షణం ప్రాంతంలోని కోననేని వారి పాలెం, మువ్వవారిపాలెం, గోనుగుంట రామచంద్రాపురం, పిడతలపూడి, మొదలైన గ్రామాలకు వెళ్లే ప్రజలందరూ ఈ బ్రిడ్జి పైనే ప్రయాణం చేస్తుంటారు. అంతేకాకుండా

కూనం నేని వారి పాలెం-చీమకుర్తి మధ్య ఎన్ఎస్పీ కాలువపై ఉన్న బ్రిడ్జి

ప్రస్తుతం కోననేని వారి పాలెం గ్రానైట్ పరిశ్రమల వలన పారిశ్రామిక కేంద్రంగా ఎదగటంతో ఆ ప్రాంతంలో ఉన్నటువంటి పరిశ్రమలకు ముడి సరుకైన రాళ్ళను తీసుకెళ్లేటువంటి లారీలు, కంటైనర్లు ఈ సింగిల్ బ్రిడ్జి మీదనే ప్రయాణించవలసి ఉంటుంది. దీనితో అప్పుడప్పుడు ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతుంది. దీనిపై నిర్మించిన రైలింగ్ కూడా లేకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు భయపడుతున్నారు. దీనిపై ఒక తాగిన వ్యక్తి ఒకసారి కాలువలో పడటం కూడా జరిగింది. ఈ బ్రిడ్జిపై ప్రయాణిస్తున్న ప్రయాణికులు ప్రభుత్వం వారిని త్వరగా ఈ పాత బ్రిడ్జి ప్రాంతంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.చీమకుర్తి మండల ఇరిగేషన్ ఈ.ఈ. నాగలక్ష్మిని వివరణ అడగగా గత మార్చి నెలలో దీనిపై కలెక్టర్ గారికి ప్రతిపాదనలు పంపించామని వారు అనుమతి ఇవ్వగానే బ్రిడ్జి నిర్మాణం చేపడతామని తెలిపారు.అలాగే పుట్ట చెరువు పాలెం- పిడతలపూడి గ్రామాల మధ్య ఉన్న, మరి చెట్ల పాలెం- అయ్యప్ప రాజుపాలెం మధ్య ఉన్న ఈ రెండు బ్రిడ్జిలు కూడా శిథిలావస్థకు చేరాయి. ప్రయాణికులకు రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా తయారయ్యాయి. ఈ బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరాయని వీటిని పునర్ నిర్మించాలని జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు పలుసార్లు కలెక్టర్ కు, జెడ్పి సీఈవోకు పలుమాలు అర్జీలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా పుల్లలచెరువు విడతలపూడి మధ్య ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి 30 లక్షల రూపాయలు మండల గ్రాంట్ శాంక్షన్ చేయటం జరిగింది. సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ నిధులు ఆగిపోయాయి. ఈ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేసి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాలని, ప్రభుత్వం వారిని, కలెక్టర్ ని ప్రయాణికులు, ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

డీఎంఎఫ్ నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తారు

చీమకుర్తి జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు

చీమకుర్తి -కూనం నేని వారిపాలెం మధ్య ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి గతంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆధ్వర్యంలో 52.72 లక్షల రూపాయలు శాంక్షన్ అయ్యాయని, సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లాయని ప్రస్తుతం కలెక్టర్ గారి డిఎంఎఫ్ నిధుల ద్వారా ఈ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని అ నిధులు రాగానే బ్రిడ్జి నిర్మాణం చేపడతారని చీమకుర్తి జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు తెలియజేశారు.

వివాద రహిత గ్రామం మిట్టమీదపాలెం

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ఆధునికయుగంలో వివాద రహిత గ్రామంగా గుర్తింపు పొందడం అభినందనీయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ అడ్వొకేట్ నూకతోటి రవికుమార్, పారా లీగల్ వాలంటీర్ పాటిబండ్ల సతీష్‌లు పేర్కొన్నారు. జిల్లాన్యాయ సేవాధికార సంస్థ లిటిగేషన్ ఫ్రీ గ్రామాలలో అవగాహన కార్యక్రమంలో భాగంగా మండలంలోని మిట్టమీద పాలెం గ్రామాన్ని న్యాయవాదుల బృందం సందర్శించింది. గ్రామం గత కొంత కాలంగా వివాద రహిత గ్రామంగా నమోదు అయ్యిందని, అందులో భాగంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ మరియు సెక్రటరీ సూచనలతో గ్రామంలోని పలువురు పెద్దలను యువతను ప్రజాప్రతినిధులును కలిసి వివాద రహిత గ్రామంగా గుర్తింపు పొందిన విషయం గురించి వారికి తెలిపారు. ప్రజలు శాంతియుతంగా సమస్యలు లేకుండా కలిసి మెలసి జీవించాలని గ్రామ ప్రజలకు సూచించారు. జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ ఉచిత న్యాయం లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ పక్రియ చట్టాలను గురించి అవగాహన కల్పించారు. ఆధార్ కార్డు లేని పిల్లలను గుర్తించాలని,

ఆధార్ కార్డు యొక్క ప్రాముఖ్యత, నమోదుపై అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో పర్ణశాల మధు గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ మండల మహాసభ

విశాలాంధ్ర-పామూరు రూరల్ : భారత కమ్యూనిస్టు పార్టీ 6వ మండల మహాసభ మంగళవారం ఉదయం 10 గంటలకు గుజ్జులయల మందరెడ్డి భవన్‌లో జరుగుతుందని సీపీఐ మండల కార్యదర్శి పి.ప్రభాకర్ తెలిపారు. ప్రతి మూడు సంవత్స రాలకు ఒకసారి మండల, జిల్లా మహాసభలు జరుపుకోవటం కమ్యూనిస్టు పార్టీకి ఆనవాయి తీగా వస్తున్న తరుణంలో ఈ మహాసభలు అత్యంత ఉత్సాహభరితంగా కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు జరుపుకొని, నూతన నాయకత్వాన్ని ఎన్ను కోవడం జరుగుతుంది అని తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రవీంద్ర బాబు, నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి పాల్గొంటారు. ఈ మహాసభలో అనేక తీర్మానాలు చేయడం జరుగుతుందని ఆ తీర్మానాల అమలు కోసం భవిష్యత్తులో కమ్యూనిస్టు పార్టీ పోరాటాలకు సిద్ధం అవు తుందనివారు తెలిపారు. ఈ మహాసభకు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు అత్యధిక సంఖ్యలో పాల్గొని మహాసభను జయప్రదం చేయవలసిందిగా ప్రభాకర్ పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ తెలిపారు. వీటిలో రెండు అర్జీలు రీ సర్వేలో పొలం తగ్గిందని మరల పరిశీలించిన న్యాయం చేయాలని బాధితులు అర్జీ అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్, ఎమ్మార్ఐ పివిఎస్ ఆర్ మూర్తి, సర్వేయర్ సిహెచ్ కాటమరాజు, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ పోగులు శేషగిరిరావు, జూనియర్ అసిస్టెంట్ వాటుపల్లి కృష్ణ ప్రసాద్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

30న జాబ్ మేళా

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండలం ఎండ్లూరు డొంక వద్ద గల జిల్లా మహిళా ప్రాంగణము నందు ఈ నెల 30వ తేదీన మెగా జాబు మేళా జరగనున్నట్టు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జె రవితేజ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదికి పైగా బహుళ జాతీయ కంపెనీలు ఈ మెగా జాబు మేళాలో పాల్గొన్నట్టు ఆయన తెలిపారు. సంతనూతలపాడు నియోజక వర్గంలోని 18 నుండి 30 సంవత్సరములు మధ్యగల పదవ తరగతి నుండి పీజీ వరకు చదువుకొని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచు కోవాల్సిందిగా వారు కోరారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి నెలకు 12 వేల రూపాయలు నుండి 20000 వేల రూపాయలు వరకు వేతనం ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. మరిన్ని వివరముల కొరకు ఎస్ కే.భాష 9963005209 మొబైల్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

నీటి సమస్యను తక్షణం పరిష్కరించాలి

మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

విశాలాంధ్ర - కనిగిరి : మున్సిపాలిటీ పరిధిలోని పాత సాయి బాబా గుడి ప్రాంతంలో సోమవారం కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పర్యటించారు. స్థానికుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రెండు నెలల నుంచి బోరు పనిచేయకపోవడంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సమస్యను మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ బోరుకు మరమ్మత్తులు చేపట్టి, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి ప్రజలకు నీటిని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చూడాలని, ఇటువంటి సమస్యలు ఎక్కడ ఉన్నా తక్షణం స్పందించాలని సిబ్బందిని మున్సిపల్ చైర్మన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ షరీఫుద్దీన్ వార్డు ఇమ్యూనిటీ లావణ్య, లైన్ మాన్ వలి పాల్గొన్నారు.

ఆటో,బైక్ ఢీ : నలుగురికి గాయాలు

విశాలాంధ్ర-పీసీపల్లి : ఆటో-బైక్ ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డ ఘటన సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని పెద అలవలపాడు పంచాయతీ పరిధిలోని పంచలింగాల కొండ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు 108 సిబ్బంది కథనం మేరకు బేస్తవారిపేట మండలం సోమరాజుపేట గ్రామానికి చెందిన సిహెచ్ బ్రహ్మయ్య బైక్‌పై నెల్లూరు వెళుతుండగా పెద అలవలపాడు గ్రామానికి చెందిన ఆటో వెంకుపాలెం నుండి పెద అలవలపాడు వైపుకు వస్తుండగా పంచలింగాల కొండ గుడి దగ్గరికి వచ్చేసరికి ఆటో బైక్ బలంగా ఢీ కొన్నాయి ఈ ప్రమాదంలో ఆటో బైక్ బోల్తాపడి నుజ్జునుజ్జు అయ్యాయి. ప్రమాదంలో బైక్‌పై ఉన్న సిహెచ్ బ్రహ్మయ్య తోపాటు ఆటోలో ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న ప్రయాణికులు 108కి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన స్పందించిన 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని కనిగిరి ఏరియా ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై స్థానిక ఎస్సై జి.కోటయ్యను వివరణ కోరగా తమకు ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

ఖరీఫ్ సాగుకు అనువైన వరి రకాలు ఎంచుకోవాలి

విశాలాంధ్ర - తాళ్లూరు: ఖరీఫ్ సాగుకు రైతులు అనువయిన వరి రకాల విత్తనాలు ఎంచుకుని ధృవీకరించిన విత్తన దుకాణాలలో విత్తనాలు తీసుకుని సాగు చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాద రావు కోరారు. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని చెప్పారు. విత్తన కొనుగోలు సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. మెరక భూముల్లో సన్న గింజ రకాలు , పల్లపు భూముల్లో మధ్యస్థ రకాలు సాగు చేపట్టాలని కోరారు. సన్న రకాలైన ఎం టీ యూ 1224, 1271, 1190 రకాలు 140 రోజుల వ్యవధి అని, దీర్ఘ కాలిక రకాలు బి పిటీ 5204, ఎం టీ యూ 1262, బి పి టీ 2595 , 2846, 2782 వి 150 రోజుల వ్యవధి అని తెలిపారు. చౌడు భూములు ఎంసీ ఎం 100, 103 రకాలు 150 రోజుల వ్యవధి అని, మన నేలకు, మన వాతావరణ పరిస్థితులకు అనువైన రకాలను సేకరించుకుని సాగు చేసుకోవాలని చెప్పారు.

బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలి

విశాలాంధ్ర -ఒంగోలు టౌన్ : జిల్లాలోని అన్ని సచివాలయాల్లో, వార్డు సచివాలల్లో ప్రజలకు నూతన పోస్టల్ సేవింగ్స్ అకౌంట్స్ లేదా ఇప్పటికే ఉన్న అకౌంట్స్‌కు ఎన్ పీ సీఐ తో అనుసంధానం కొరకు జిల్లాలో ప్రత్యేక మేళాలు నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా తపాలా డివిజన్ సూపరిండెంట్ ఎండీ జాఫర్ సాధిక్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లబ్ధిదారులను డిబిటీ ద్వారా అందించు పథకాలను వారి ఆధార్, బ్యాంకు అకౌంట్ ఎన్ పీ సీఐ అనుసంధానం తప్పనిసరి అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లాలో 11,108 మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలు ఎన్ పీ సీఐ తో అనుసంధానం కాలేదని చెప్పారు. కావున ఈనెల 31 నుండి జూన్ 6వ తేది వరకు ప్రతి గ్రామ పరధిలో ప్రత్యేక మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోస్టల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కోరారు.

నల్ల బర్లీ పొగాకు నిల్వల నమోదు

విశాలాంధ్ర-దొనకొండ: గుంటూరు వ్యవసాయశాఖ కమీషనర్ ఆదేశాల మేరకు మండలంలో నల్ల బర్లీ పొగాగు నిల్వలను పరిశీలించి నమోదు చేస్తున్నట్లు ఏఓ ఎన్.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో వ్యవసాయ సహాయకుడు ఏపీఎంఐఎస్ యాప్ నందు చేస్తున్న నమోదును ఆయన స్వయంగా పరిశీలించారు. రైతులు సాగు చేసిన నల్ల బర్లీ అమ్ముడు పోగా మిగిలిన స్టాక్‌ను భౌతికంగా చూసిన తర్వాత మాత్రమే నమోదు చేయాలంటూ సిబ్బందిని ఆదేశించామని, ఇప్పటికే 87 మంది రైతులకు చెందిన 1700 క్వింటాళ్ళ పొగాను నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో బోల్తా... ముగ్గురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-దొనకొండ:
ప్రమాదవశాత్తూ ఆటో బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం జరిగింది. హెడ్ కానిస్టేబుల్ రంగనాయకులు తెలిపిన వివరాలు... కారంపూడికి చెందిన కొందరు కనిగిరి వద్ద పోలేరమ్మ గుడిలో మొక్కులు చెల్లించుకుని తిరిగి వెళ్తున్నారు. స్థానిక పొర సరఫరాల గిడ్డంగి సమీపంలో ప్రమాదవశాత్తూ ఆటో తిరగబడింది. ఈ ఘటనలో నాగార్జున, నాగరాజు, సిద్ధేశ్వరరావులకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనానికి సమాచారం ఇచ్చినప్పటికి అందు బాటులో లేక పోవటంతో అదే ఆటోలోనే వైద్యం నిమిత్తం కురిచేడుకు వెళ్ళారు.

పోరు బాటను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-ముండ్లమూరు :
ఆరుగాలం కష్టపడి పండించి నష్టపోయిన పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన రైతు పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు చింతా శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం వైయస్సార్‌సిపి జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందని అన్నారు. మండల కేంద్రమైన ముండ్లమూరులోని ఓ ప్రైవేటు భవనంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. రైతులకు సరైన గిట్టుబాటు ధర లేక తప్పనిసరి పరిస్థితులలో పంటను నష్టాలకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పొగాకు రైతులు పట్ల ప్రభుత్వం ధరలు పెంచడంలో విఫలమైందన్నారు, రైతులు పండించిన పంటలను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నెల 28న పొదిలిలో జరగనున్న పోరుబాట కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల నుండి రైతులు, బూచేపల్లి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సూది దేవర అంజయ్య, దర్శి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి రైతు అధ్యక్షుడు బంకా నాగిరెడ్డి. మేడగం రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం

గట్ల విజయభాస్కర్ రెడ్డి

విశాలాంధ్ర-పామూరు : పొగాకు రైతుల కష్టాలు తెలుసుకునేందుకు వైయస్ఆర్ సీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 28న మార్కాపురం నియోజకవర్గం పొదిలిలో తలపెట్టిన జగనన్న పోరుబాట కార్యక్రమానికి కనిగిరి ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామం నుండి తరలిరావాలని వైసీపీ రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం సెక్రటరీ గట్ల విజయభాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్ర నష్టాలు ను ఎదుర్కొంటున్నా రన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పొగాకుకు మద్దత ధర కల్పించేందుకు మార్క్ ఫెడ్‌ను రంగంలోకి దించారని,ఏడాదికి రూ.3 వేల కోట్లకు పైగా ధరల స్థిరీకరణ నిధి కేటాయించడంతో రైతులు లాభపడ్డారని గట్ల విజయభాస్కర్ రెడ్డి గుర్తు చేశారు..జగన్ మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు పొగాకు క్వింటా రూ.34,000 వేలు అమ్మితే ఇప్పుడూ రూ.22,000 వేలకు కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని గట్ల విజయభాస్కర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ పట్టణ కమిటీకి శుభాకాంక్షలు

ఎంపిటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు ఆకుపాటి

విశాలాంధ్ర-పామూరు రూరల్ : పట్టణ టీడీపీకి నూతనంగా ఎన్నికైన కమిటీకి ఎంపిటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ శుభా కాంక్షలు తెలిపారు. సోమవారం టీడీపీ నూతన కమిటీ అధ్యక్షులు సయ్యద్ అమీర్ బాబు, ఉపాధ్యక్షులు ఇర్రి కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నోసం నాగేంద్ర చారి, తెలుగు యువత అధ్యక్షులు మెంటా నరసింహారావులకు క్యాంపు కార్యాల యంలో ఘనంగా ఆకుపాటి వెంకటేష్ మిత్ర బృందంతో కలిసి సత్కరించారు.

పొగాకు కొనుగోలుపై ప్రభుత్వ నిర్లక్ష్యం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు :
రాష్ట్రంలో పొగాకు రైతులతో పాటు అన్ని పంటలు పండించిన రైతాంగం పట్ల ప్రభుత్వం వివక్ష విడనాడాలని ఎస్సీ సెల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకరావు తెలిపారు. ప్రకాశం జిల్లాలో పొగాకు కొనుగోలు చేయక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు సంఘీభావంగా ఈ నెల 28న పొదిలిలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నేరుగా రైతులుతో మాట్లాడనున్నారు కనుక పొగాకు రైతులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. సోమవారం ఉప్పుగుండూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కనకరావు మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు పంట సాగు చేసిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు జీవితంలో ఎన్నడూ ఎదుర్కోలేదన్నారు. గత ప్రభుత్వం లో పొగాకు కొనుగోలు చేసే కంపెనీ లు సిండికేట్ అయ్యి ఇలాగే రైతులను ఇబ్బంది పెట్టాలని చూసిన సందర్భంలో మాజీ ముఖ్యమంత్రి నేరుగా మార్కుఫెడ్ ద్వారా రైతుల వద్ద ఉన్న పొగాకు ను కొనుగోలు చేయడం తో పాటు 3500 కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధి ద్వారా మిగతా పంటలకు కనీస మద్దతు ధర ఇప్పించిన ఘనత జగన్మోహన్ రెడ్డి కె దక్కిందన్నారు. సమావేశంలో పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలినేని కోటేశ్వరరావు, రైతు విభాగం మండల అధ్యక్షుడు తగిరిస సుబ్బారావు, గ్రీవెన్సు సెల్ రాష్ట్ర కార్యదర్శి పేరాల చెన్నకేశవులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు

విశాలాంధ్ర-చీమకుర్తి :
చీమకుర్తి పట్టణంలోని స్థానిక శ్రీ భద్రావతి భావన రుషి పద్మశాలి కళ్యాణ మండపం నందు 2024 - 25 సంవత్సరంలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు చీమకుర్తి పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా ఆర్.డబ్ల్యుడి ప్రాజెక్టు డైరెక్టర్ పి.విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యాసాగర్ మాట్లాడుతూ నేటి కాలంలో విద్య అనేది ప్రతి ఒక్కరికి అవసరమని,విద్య నేర్చుకోవడం ద్వారా సమాజంలో తన విలువలను కాపాడుకోవచ్చునని, మంచి ఉన్నత భావాలు గల వ్యక్తులుగా తయారవుతారని అన్నారు. అనంతరం పదవ తరగతిలో 500 మార్కులు పైగా సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు, ఇంటర్మీడియట్ లో 900 మార్కులకు పైగా సాధించిన విద్యార్థిని విద్యార్థులకు మెమెంటో శాలువాతో సత్కరించారు. మొదటి స్థానాన్ని సాధించిన ఇరువురి విద్యార్థులకు నగదు పారితోషకంతో పాటు తెలుగు ఇంగ్లీష్ డిక్షనరీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరాలజీ వైద్యులు పి. గోపికృష్ణ, గుండె వైద్య నిపుణులు కే. వెంకటేశ్వర్లు ప్రకాశం జిల్లా చేనేత అధికారి అనుముల వెంకటేశ్వర్లు, చీమకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ గోపవరపు రాజ్యలక్ష్మి, కౌన్సిలర్ సోమా శేషాద్రి ఉపాధ్యాయులు పల్లెల రమేష్ బాబు, ఓగూరి తిరువెంగళం, మాజీ నావి కాగల ఉద్యోగి తాడికొండ వెంకట సుబ్బారావు, మాజీ ఉపాధ్యాయులు దోమల పుల్లయ్య, దొంతు సోమయ్య, భద్రావతి భావనా రుషి స్వామి ఆలయ అధ్యక్షులు దొంతు వెంకటరావు,అవ్వారు ఆదినారాయణ, గుద్దంటి శ్రీనివాసరావు, నూకల రాఘవ,బుడ్డాబత్తిన నరసింహారావు పాల్గొన్నారు.

నేతలకు పాలాభిషేకం

విశాలాంధ్ర - పర్చూరు : పర్చూరు -ఇంకొల్లు ఓల్డ్ మద్రాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై తెలుగుదేశం పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,ఆర్ అండ్‌బి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే ఏలూరి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సంద ర్భంగా కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో టిడిపి పర్చూరు మండలం అధ్యక్షులు షేక్ సంషుద్దీన్,కారంచేడు మండల అధ్యక్షులు తిరుమల శెట్టి శ్రీహరి,ఇంకొల్లు మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బేతపూడి సురేష్,పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

తనయుడి మరణం తట్టుకోలేక తండ్రి మృతి

విశాలాంధ్ర - పర్చూరు : మండలంలోని నాగులపాలెం గ్రామంలో తండ్రి, తనయుడు మృతి చెందడంతో విషాద ఛాయ లు అలుముకున్నాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పోట్రు హరిబాబు(62)కు ఇద్దరు కుమా రులు. పెద్ద కుమారుడు మణికంఠ (37)కు వివాహము కాగా అనా రోగ్యముతో గతంలోనే భార్య మృతి చెందింది.అనారోగ్యంతో వైద్య సేవలు పొందుతున్న మణికంఠ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో తండ్రి హరి బాబుకు గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. గంటల వ్యవధి లో తండ్రి కొడుకులు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి,సందర్శకులకు కన్నీరు పెట్టించాయి.

వాగులో పడి యువకుడు మృతి

విశాలాంధ్ర - పర్చూరు : పర్చూరు ఇందిరా కాలనీకి చెందిన జొన్నలగడ్డ మోహన్ కుమార్(24) పర్చూరు వాగు వద్దకు బహిర్భూమికి వెళ్లి కాలుజారి వాగులో పడి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జొన్నలగడ్డ నాగరాజు, మాధవి దంపతులకు ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు మోహన్ కుమార్ ఇంటి వద్ద నిర్వహించే దుకాణమునకు సహాయకుడిగా పని చేస్తున్నాడు. తండ్రి నాగరాజు ఆర్టీసీ లో మెకానిక్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబానికి చేయూతగా ఉం టాడనుకున్న కుమారుడు అకాల మరణంతో కుటుంబ సభ్యులు, బంధు వుల రోదనలు మిన్నంటాయి. పర్చూరు వాగులో జారిపడిన మోహన్ కుమార్‌ను వెలికి తీయటానికి చీరాల అగ్నిమాపక సిబ్బంది చర్యలు చేపట్టారు. వీఆర్వోలు గోవిందరెడ్డి, యార్లగడ్డ శ్రీనివాసరావు శవ పంచ నామ నిర్వహించి, శవపరీక్ష కోసం ఎస్సై మాల్యాద్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యోగపై శిక్షణ

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని పూనూరు గ్రామంలో యోగా ఫర్‌లక్ కార్యక్రమం నిర్వ హించారు.జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరిం చుకొని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నంలో జరిగే యోగ సభకు హాజరవుతున్న కార్యక్రమంలో భాగంగా వేణుగోపాల స్వామి దేవాలయం, సచివాలయంలో యోగా కార్యక్రమాలు నిర్వహిం చారు. గ్రామస్తులు 50 మంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధి కారి డాక్టర్ జి.అంజమ్మ,బాపట్ల జిల్లా యోగా ఇన్‌స్ట్రక్టర్ మరియమ్మ జ్యోత్స్న యోగా అభ్యాసం చేయించారు.

నేడు రైతుల నిరసన దీక్ష

విశాలాంధ్ర - పర్చూరు : పల్నాడు జిల్లా చిలకలూరిపేట ఐటీసీ పొగాకు కంపెనీ ఎదు రుగా 27న మంగళవారం ఉదయం 10 గంట లకు నల్ల బర్లీ పొగాకును వెంటనే కొనాలని రైతుల నిరసన దీక్ష చేపడుతున్నామని రైతు సం ఘాల సమన్వయ కమిటీ ప్రతినిధి కొల్లా రాజ మోహనరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. రైతులు, రైతు నాయ కులు, ప్రజలు, ప్రజాస్వా మికవాదులు, రైతుల పంట లకు న్యాయమైన ధర రావాలనే వారంతా దీక్షలో పాల్గొనాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవ సాయ మంత్రి అచ్చం నాయుడు సమక్షంలో కంపె నీలు అంగీకరించిన విధంగా బర్లీ పొగాకును వెం టనే కొనుగోలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ వ్యవ సాయ మంత్రి సమక్షంలో లాంఫార్మ్ సమావేశంలో గత నెల 28న కంపెనీలు అంగీకరించిన విధంగా, గత సంవత్సరం కొన్న రూ.15,000 తక్కువ కాకుం డా క్వింటాల్ బర్లీ పొగాకును కంపెనీల చేత కొని పించాలి, కంపెనీలు న్యాయమైన ధర 15,000కు కొనకపోతే,ప్రభుత్వ సంస్థ మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు కొని రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.పొగాకు బోర్డు పరిధిలోకి బర్లీ పొగాకు ను చేర్చాలని రాజమోహనరావు కోరారు.

విద్యుత్ ఏఈ లేక అవస్థలు

- అవస్థలు పడుతున్న వినియోగదారులు

విశాలాంధ్ర - నిజాంపట్నం : విద్యుత్ శాఖలో ఏఈ,సిబ్బంది కొరత వేధిస్తోంది. నిజాంపట్నం మం డలానికి విద్యుత్ శాఖ ఏఈ లేక విద్యుత్ వినియోగ దారులు, రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రతి నిత్యం విద్యుత్ శాఖ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వందలాది మంది విద్యుత్ వినియోగ దారులు వస్తుంటారు. కానీ నాలుగు సంవత్సరాల నుంచి మండలంలో విద్యుత్ ఏఈ పోస్ట్ ఖాళీగా ఉండటంతో విద్యుత్ సంబంధించిన పనులు మంద కొడిగా సాగుతున్నాయి. దీంతో విని యోగదారులకు అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ సబ్ ఇంజనీర్‌గా పనిచేసిన కళ్యాణ్ ఏఈ లేనప్పటికీ విద్యుత్ సంబం ధించిన పనులన్నీ ఆయనే చూసుకునే వారు. బదిలీ ల్లో భాగంగా ఆయన 7 నెలల కిందట బాపట్లకు వెళ్లారు. దీంతో మండ లంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ సిబ్బందే కొత్త విద్యుత్ కనెక్షన్లు, బకాయిల వసూలు, విద్యుత్ మర మ్మతులు, విద్యుత్ సరఫ రాలో అవాంతరాలు, పున రుద్దరణ వంటి పనులను చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు స్పందించి మండలానికి విద్యుత్ ఏఈని నియమించాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

- ఉన్నతాధికారులకు నివేదిస్తాం :

ఈ విషయమై చెరుకుపల్లి విద్యుత్ శాఖ డీఈఈ సురేష్‌ను వివరణ కోరగా నిజాంపట్నం మండలానికి విద్యుత్ ఏఈ లేని మాట వాస్త వమేనని, సమస్యను విద్యుత్ ఉన్నత అధికారులకు దృష్టికి తీసుకువెళ్లి ఏఈని నియమించేలా కృషి చేస్తానని చెప్పారు.వచ్చే నెలలో బదిలీలు ఉన్నాయని బహుశా ఆ బదిలీల్లో మండలానికి ఏఈతో పాటు సిబ్బందిని నియమించే అవకాశం ఉందని ఆయన తెలిపారు.మండలంలో విద్యుత్ సంబంధించిన సమస్యలు ఏమున్నా వినియోగదారులు తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని అయన తెలిపారు.

ఫారెస్ట్ భూములు అమ్ముకున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : జిల్లాలో ఫారెస్ట్ భూములు అమ్ముకున్న ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాపట్ల జిల్లా కలెక్టర్‌కి జై భీమ్ రావ్ భారత పార్టీ నాయకులు పర్రె కోటయ్య, కొచ్చర్ల వినయ్ రాజు, పులిపాటి హేబేలు అర్జీ అందజేశారు.మండలంలోని సూర్యలంక అడవి ప్రాంతంలో ఫారెస్ట్ భూములను సూర్యలంక అడవి ప్రాంతంలో ఉన్న అడవి అధి కారులు రేంజ్ ఆఫీసర్, డిఆర్ఒ,ఫారెస్ట్ గార్డ్ ఈ ముగ్గురు కలిసి సూర్యలంక ప్రాంతంలో ఫారెస్ట్‌కు ఆనుకుని ఉన్న భూములను సూర్యలంక వాసులకి అమ్ముకున్నారని ఆరోపణ చేశారు. సూర్యలంక ఎయిర్ ఫోర్స్ ఎదురుగా సర్వే ప్లాంటేషన్ వేశారు కానీ మొక్కలు లేవు కొన్ని పనులు చేయకుండానే పనులు చేయించినట్టుగా చూపించినారన్నారు.ఈ ప్రాంతంలో గత సంవత్సరము, ఈ సంవత్సరము మూడు ప్లాంటేషన్ వేసినారని ఈ మూడు ప్లాం టేషన్ మనుషులు ద్వారా పని చేయించకుండా ప్రొక్లైన్ ద్వారా మడ పనులు చేయించారన్నారు. రేంజ్ ఆఫీసర్,డిఆర్ఒ,ఫారెస్ట్ గార్డు పైన తెలిపిన అధికారులు పైనా ఎటువంటి చర్య తీసుకోలేదు అక్కడ ఫారెస్ట్ భూములులో అక్రమగా నిర్మించిన గృహాలను ఇప్పటివరకు తొలగించలేదని ఎన్నిసార్లు తమరికి అర్జీలు ఇచ్చినప్పటికీ ఉన్నత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దర్యాప్తు చేయించి అక్ర మాలకు పాల్పడుతున్న వారిపైన ఫారెస్ట్ భూములలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించి ఇల్లు కట్టుకున్న వారి పైన చర్యలు తీసుకోవాలని,తక్షణమే ఆ గృహాలను తొలగించాలని కోరారు. బాపట్ల నియోజకవర్గ ఇన్చార్జి కొచ్చర్ల వినాయరాజు, అద్దంకి నియోజక వర్గం ఇన్చార్జి పులిపాటి హేబేలు పాల్గొన్నారు.

మహానాడును జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - పిట్టల వానిపాలెం : కడపలో జరిగే మూడు రోజుల పసుపు పండగ మహానాడు కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలని మం డల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరీ యానెట్ సౌపాటి పిలుపునిచ్చారు. సోమవారం ఆమె మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం, తెలుగు రాష్ట్రాల ప్రగతి కోసం, దశాబ్దాలుగా కృషి చేస్తున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని చెప్పారు. ఈ నెల 27 నుండి 29 వరకు కడపలో జరుగనున్న మహానాడు కార్యక్రమా నికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సారధ్యంలో బాపట్ల నియోజకవర్గం నుండి టీడీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లి మహానాడును జయ ప్రదం చేద్దామని ఆమె చెప్పారు. మహానాడుకు వెళ్లే ప్రతి ఒక్కరూ విధిగా సభ్యత్వ కార్డును ధరించి వెళ్లాలని ఆమె చెప్పారు.

సిద్దు వెంకట సుబ్బారావుకు విశ్వకర్మ అవార్డు

విశాలాంధ్ర - జె.పంగులూరు : హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ 9వ వార్షికోత్సవ సందర్భంగా వృవస్థపాక చైర్మన్ విశ్వనాదుల పుష్పగిరి ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న వివిధ రంగాలలో ప్రతిభ కనబచినవారికి విశ్వకర్మ లీడర్, విశ్వకర్మ యంగ్ లీడర్,విశ్వకర్మ లెజెండ్ అవార్డ్స్ ప్రధా నోత్సవం జరిగింది.సేవా, సామాజిక రంగం, వృత్తిపరంగా పలు రకాల సేవలను చేస్తున్న సిద్దు వెంకట సుబ్బారావుని గుర్తించి వారికి ఈ కార్యక్రమ ముఖ్య అతిధి బ్రహ్మశ్రీ కె.కిరణ్ కుమార్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ క్రైమ్ బ్రాంచ్ తెలంగాణ స్టేట్ వారి చేతుల మీదుగా విశ్వకర్మ లెజెండ్ అవార్డును అం దుకున్నారు. ఈ అవార్డ్స్ ప్రధానోత్సవానికి తెలంగాణ అధ్యక్షులు శ్రీఆకారం శ్రీనివాసా చారి, ప్రధాన కార్య దర్శి సోల్లేటి ప్రభాకరాచారి, కొండపి గణేష్‌బాబు, విశ్వ కర్మ సేవాట్రస్ట్ ప్రధానకార్యదర్శి తక్కెళ్ళ పాటి నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు ఎమ్మెల్యే వేగేశన విరాళం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కడపలో జరగ నున్న తెలుగుదేశం పార్టీ పసుపు పండుగ మహానాడు-2025కి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రూ.10 లక్షలు చెక్కు రూపంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత జరిగే మొట్ట మొదటి మహా నాడుని టీడీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పా ట్లు చేస్తుందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి కడప వచ్చే వారికి బస,భోజన ఏర్పాటులో ఎటువంటి ఇబ్బం దులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పేరం శాంతమ్మకు పాణెం నివాళి

విశాలాంధ్ర - సంతమాగులూరు : సంత మాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నేత పేరం కోటేశ్వరావు మాతృమూర్తి పేరం శాంతమ్మ అనా రోగ్యంతో ఇటీవల మృతి చెం దారు. ఆ పార్టీ నేతలు ద్వారా విషయం తెలుసుకున్న అద్దంకి ఇన్‌ఛార్జ్ పాణెం హనిమిరెడ్డి సోమవారం కొప్పరం వెళ్లారు. ముందుగా శాంతమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా కోటే శ్వరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతిని తెలిపారు. అనంతరం సంతమాగులూరు మండల కన్వీ నర్ ఉట్ల నాగేశ్వరరావుతో కలిసి స్థానిక నేతలు, కార్యకర్తలతో కాసేపు మాట్లాడారు.ఈకార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ ప్రెసిడెంట్ షేక్. మాబు,నాయకులు కొల్లి వెంక ట్రావు, నాని, హోటల్ బుజ్జి, ఏసోబు, చెన్నా రెడ్డి, పావులూరి శివయ్య, కెల్లంపల్లి శ్రీకృష్ణ పాసకాలరావు పాల్గొన్నారు.

తెలుగుజాతి జీవనాడి బాపట్ల

– ఫోరంఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పీసీ సాయిబాబు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : తెలుగుజాతి అస్తిత్వ సాధనలో బాపట్ల అద్వితీయమైన పాత్రను పోషించిందని ఫోరంఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు అన్నారు.తెలుగు వారికి ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలనే డిమాండ్ ఇక్కడే రూపుదిద్దుకుందన్నారు.ప్రథమాంధ్ర మహాసభ 112వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో టౌన్‌హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల స్థూపం వద్ద తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.మా తెలుగు తల్లి గేయాన్ని ఆలపించారు. ఆంధ్రుల స్వరాష్ట్ర వాంఛకు ఇక్కడే బీజం పడింది.1913లో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ నాలుగు దశాబ్దాల ఆంధ్రోద్యమానికి నాంది పలికిందన్నారు.తెలుగు వారి ఐక్యతకు అది ఫూతమిచ్చిందని టౌన్ హాల్‌లో జరిగిన మహాసభలు భాషా ప్రయుక్త రాష్ట్ర వాదనకు శ్రీకారం చుట్టాయన్నారు.ఈ విధంగా బాపట్ల సభలు ఆంధ్రరాష్ట్ర అవతరణకు పునాదిగా నిలిచాయన్నారు.1926లో అంధ్ర విశ్వవిద్యాలయ స్థాపనకు కూడా బాపట్లలోనే బీజం పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంజీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.దుర్గా ప్రసాదరావు,న్యాయవాది జమ్రుద్ భాష,విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కె.విజయ కుమార్,నాయకులు గురజాల శ్రీనివాసరావు,కేశవులు, పనశాల, న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీ గ్రామ సచివాలయంలో సోమవారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర,ప్లాస్టిక్ నిషేధం గురించి అవగాహన కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామ సభలో బాపట్ల ఎంపిడిఓ బి.బాబురావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం నందిరాజుతోటలోని ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌లో వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని ఎంపిడిఓ పరిశీలించి సూచనలు చేశారు.పరిశుభ్రత,ప్లాస్టిక్ నిషేధం గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి కె.ఎల్.ప్రభాకరావు వెస్ట్ బాపట్ల గ్రామ సచివాలయాన్ని సోమవారం తనిఖీ చేసి ఎస్ డబ్ల్యు పిసి షెడ్‌ని సందర్శించి వర్మీ కంపోస్టు తయారీ, అమ్మకాలు గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, గ్రామ పెద్దలు మరీదు వెంకటేశ్వర్లు, అద్దంకి శ్రీనివాసరావు, కరి మీరయ్య, నక్కా జయశీలరావు, సుబ్బారావు, సచివాలయం ఉద్యోగులు, యానిమేటర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకం పోటీల్లో నోనితకు ప్రథమ స్థానం

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఏల్చూరు-1 విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సీహెచ్‌ఓగా పని చేస్తున్న సౌజన్య కుమార్తె బి.నోనిత భగవద్గీత శ్లోకాల కంఠస్త పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంట ర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కన్సొన్సెస్ వారి సౌజన్యంతో నరసరావుపేట పట్టణంలోని బరంపేటలో ఉన్న శ్రీరాధా గోవింద చంద్ర మందిరంలో భక్త ప్రహ్లాద సమ్మర్ క్యాంపు-2025 ఆధ్వర్యంలో భగవద్గీతపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. నెల రోజుల పాటు జరిగిన శిక్షణపై భగవద్గీత శ్లోకాలు కంఠస్తం, కథలు, వైష్ణవ కీర్తనలు, ఇతరత్రా అంశాలపై పోటీలను సోమవారం నిర్వహించారు. సుమారు 150 మంది బాలబాలికలు పోటీలకు హాజరయ్యారు.వీరిలో నోనిత శ్లోకాలు కం ఠస్తంలో ప్రతిభ కనబరుస్తూ ప్రథమ స్థానంలో నిలిచింది. అనంతరం ఇస్కాన్ టెంపుల్ ప్రెసిడెంట్ రూపేశ్వర చైతన్య దాస్ చేతులు మీదుగా విద్యార్థినికి జ్ఞాపిక,ప్రశంస పత్రం అందజేశారు.ఈసందర్భంగా నోనితను తల్లిదండ్రులు సౌజన్య, సత్యనారాయణ, బంధుమిత్రులు, స్నేహితులు ప్రత్యేకంగా వారిని అభినందించారు.

మెడికల్ కాలేజీల పనులు పునః ప్రారంభించాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో అర్థాంతరంగా మెడికల్ కాలేజీల పనులు నిలిపి వేశారని వెంటనే ప్రభుత్వం రాష్ట్రంలో ఆపివేసిన మెడికల్ కళాశాల పనులు వెంటనే పునఃప్రారంభించాలని బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుదే రాజారావు పార్టీ నాయకులతో కలసి కలెక్టర్ జె.వెంకట మురళికి అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా ప్రధాన కేంద్రం బాపట్లలో మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయితే జిల్లా ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, మెడికల్ కాలేజీ నిర్మాణంతోనే సాధ్యం అవుతుందన్నారు. పబ్లిక్, ప్రైవేటు, పార్టనర్షిప్, పద్ధతిలో కాకుండా ప్రభుత్వ నిధులతోనే మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు ప్రమేయం లేకుండా కార్పొరేట్ వ్యవస్థలకు అప్పగించకుండా ప్రభుత్వ నిధులతోనే మెడికల్ కాలేజ్ నిర్మించాలన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు,వైద్య విద్యార్థులకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ హాస్పిటల్ నిర్మాణం వలన సాధ్యం అవుతుందన్నారు. మెడికల్ విద్యార్థులకు శిక్షణ, పరిశోధన అవకాశాలు పెరుగుతాయన్నారు. ఉద్యోగ అవకాశాలు పెరిగి, స్థానిక యువతకు ఉపాధి లభిస్తుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం నుంచి నిధులు హెచ్చించి, ప్రభుత్వ నిధులతోనే హాస్పిటల్ నిర్మాణం త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వానికి తెలియజేయాలని జిల్లా కలెక్టర్‌ని కోరారు.ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు డాక్టర్ గడ్డం ఏలియా, పాలపర్తి సంతమ్మ, నల్లమోతు శ్యామ్యూల్ జాన్సన్, పునుగు పాటి ఆనంద్‌రావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర - అద్దంకి : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అద్దంకి సీఐ ఆరాధ్యుల సుబ్బరాజు అన్నారు. సోమవారం అద్దంకిలో సీఐ సుబ్బరాజు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ వెహికల్ సి.బుక్ వెంట ఉంచుకోవాలన్నారు. త్రిబుల్ రైడింగ్ నేరంగా పరిగణించబడుతుందన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకోవచ్చని అతివేగం ప్రమాదకరమన్నారు.

జగనన్న పోరుబాట జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - అద్దంకి : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బర్లీ పొగాకు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న ఉమ్మడి ప్రకాశం జిల్లా పొదిలిలో తలపెట్టిన జగనన్న పోరుబాట కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ హనిమిరెడ్డి వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం అద్దంకి పార్టీ కార్యాలయంలో జగనన్న పోరుబాట కరపత్రాలను హనిమిరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మంచి వక్తలుగా ఎదిగే అవకాశం

విశాలాంధ్ర - సంతమాగులూరు : పుస్తక పఠనంతోనే మంచి వక్తలుగా ఎదిగే అవకాశం ఉందని గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. సంతమాగులూరు శాఖ లైబ్రరీలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 24వ రోజు సోమవారం నిర్వహించారు.19 మంది బాలబాలికలు హాజరై, స్పోకెన్ ఇంగ్లీష్, పలు రకాల పుస్తకాలు చదివారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరికి పదిమంది ఎదుట చదవాలన్నా, మాట్లాడాలన్నా భయం, బెరుకు, స్టేజ్ ఫీలింగ్ ఉంటుంది. దాని నుంచి బయటకు రావాలంటే విద్యార్థి దశ నుంచే సాధన చేయాలని సూచించారు. బృందాలుగా ఏర్పడి సబ్జెక్టులో తమకున్న అనుమానాలను నివృత్తి చేసుకోవడం వల్ల మీపై నమ్మకం వస్తుందని చెప్పారు.

భూ సమస్యపై కలెక్టర్‌కు పూజారి వినతి

విశాలాంధ్ర - సంతమాగులూరు : మా పూర్వీకులకు చెందిన ఆస్తిని సంబంధంలేని వ్యక్తుల పేరుతో రెవెన్యూ అధికారులు ఆన్లైన్ చేశారని సంతమాగులూరు మండలం తంగేడుమల్లి రామాలయం అర్చకులు పి.శ్రీరామయ్య కుమారుడు సుబ్బరాయశర్మ ఆవేదన వ్యక్తంచేశారు.ఈ మేరకు సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ జె.వెంకట మురళికి వినతిపత్రం సమర్పించారు.దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు,సంతమాగులూరు తహశీల్దార్ రవిబాబులతో ఫోన్లో మాట్లాడారు. భూముల రికార్డులను మరోసారి పరిశీలించి, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

పిడుగుపాటుకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం

విశాలాంధ్ర - చీరాల : పిడుగు పడి రహదారికి అడ్డంగా కరెంటు స్తంభం పడిన సంఘటన చీరాల మండలం కొత్తపాలెం పంచాయితీ పరిధిలో జరిగింది. రహదారికి అడ్డంగా పడిన కరెంటు స్తంభాన్ని విద్యుత్ శాఖాధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే తొలగించాలని పాత చీరాల కొత్తపాలెం పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి ఉరుములు,మెరుపులతో పడిన వర్షంలో పిడుగు పాటుకు కొత్తపాలెం పంచాయతీలో విద్యుత్ స్తంభం రహదారికి అడ్డంగా పడిపోయింది. దీనిని గమనించిన స్థానికులు స్థంభాన్ని తొలగించాలని విద్యుత్ శాఖాధికారులను కోరారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ విద్యుత్ స్తంభం పడిన సమాచారం అధికారులకు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు తొలగించలేదన్నారు. విద్యుత్ తీగలలో కరెంటు ఉందో లేదో తెలియదని దగ్గర లో హెూటల్ ఉండడంతో భయాందోళనకు గురవుతున్నామన్నారు. అధికా రులు వెంటనే స్తంభాన్ని తొలగించాలని కోరారు.

దాహార్తి తీర్చడం అభినందనీయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఎన్ఆర్ అండ్ పీ ఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో గరల్స్ హైస్కూల్ వద్ద నిర్వహిస్తున్న ఉచిత మజ్జిగ చలివేంద్రం ప్రారం భించి 30 రోజులు అయిన సందర్భంగా చలివేంద్రాన్ని చీరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కౌతరపు జనార్ధన్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు ఒక్కింటికీ రూ.3,100ల ఖర్చుతో ఇప్పటికీ రూ.93,000లు ఖర్చు చేసి, వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీ యం అన్నారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ మరొక 11 రోజులు ఈ చలివేంద్రంను కొనసాగిస్తామని తెలి పారు. ఈ కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్, శీరాం రమేష్, డివి సురేష్, మద్దు జయప్రసాద్,మద్దు శ్రీనివాసరావు, సుబ్బారావు, బుల్లిబాబు, నారాయణ, రమణారావు, కాటమరాజు, రామారావు, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

కదిరి పార్థసారథికి పోలేరమ్మ నవగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి ఆహ్వానం

విశాలాంధ్ర- సిఎస్‌పురం : సిఎస్‌పురం మండలంలోని గుంతచెన్నంపల్లి గ్రామంలో ఈనెల 28 నుండి జరిగే శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ ,పోతురాజు,నవ గ్రహ ప్రతిష్టా మహోత్సవానికి కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథిని దేవస్థానం కమిటీ సభ్యులు సోమవారం శీలంవారిపల్లిలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ శ్రీను,కె బాబు, తిరుపతయ్య, జమకాల మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం బీసీ కాలనీలో సీసీ రోడ్లు వేయాలి

విశాలాంధ్ర - బేస్త వారిపేట : మండలంలోని మోక్షగుండం బీసీ కాలనీలో సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేసి, మురుగు కాలువలు నిర్మించాలని భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మండలంలోని బేస్తవారిపేట, మోక్షగుండం గ్రామాల్లో సోమవారం సీపీఐ పార్టీ శాఖా సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు దాకాల పుల్లయ్య మాట్లాడుతూ గ్రామంలో బీసీ కాలనీ ఏర్పడి 36 సంవత్సరాలైనప్పటికీ నేటికీ అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి వంద సంవత్సరాలు పూర్తి అవుతుందని, జమీందారీ, భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా దున్నే వానికి భూమి కావా లని వీరోచిత పోరాటాలు చేసి విజయం సాధించిందని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శి కేవీ రమణ అన్నారు. అంతకుముందు సీపీఐ జం డాను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ నూతన కార్య దర్శిగా ఎంవీ కొండయ్యను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఊరు మార్పు జోసెఫ్, ఏఐటీయూసీ నాయకులు యోగయ్య, తాళ్ల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరా హోరీగా క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర - ముండ్ల మూరు : ముండ్లమూరు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు హోరా హోరీగా సాగుతూ నేటితో ముగిశాయి. ముండ్లమూరు మెగా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్న మెంట్ ప్రారంభించారు. ఇప్పటివరకు 60 మ్యాచు లతో పోటీలు జరిగాయి. మే నెల 5వ తేదీన ప్రారంభించి సోమవారం చివరగా ఆరు జట్లు తలప డ్డాయి. విన్నర్‌గా మెగా ఫ్రెండ్స్ యూత్ విజయం సాధించి మొదటి బహుమతి రూ.25,216 బేతపూడి రామారావు, రావూరి దుర్గాప్రసాద్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన రమణాల వారి పాలెం టీంకు దర్శి నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు మాజీ సర్పంచి మేదరమెట్ల వెంకటరావు, మేదరమెట్ల అచ్చ య్య రూ.15,000 బహుమతి అందజేశారు. తృతీయ బహుమతి రూ. 10,116 ఆనం నాగేశ్వరరావు అందజేశారు.

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి

విశాలాంధ్ర - కొమరోలు : విద్యుత్ షాకుకు గురై రెండు గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని నారాయణ పల్లెలో జరిగింది. కొమరోలు మం దలం లోని నారాయణపల్లె సమీపంలో తీవ్రమైన గాలులు, వర్షాలకు విద్యుత్ స్తంభాలు క్రింద పడిపోవడంతో, విద్యుత్ తీగలు తగిలి రెండు గేదలు మృతి చెందాయి. మృతి చెందిన గేదల విలువ సుమారు లక్షన్నర రూపాయలు ఉంటుందని తిరుపతి పల్లెకు చెందిన గేదల యజమాని మోడి వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, విద్యుత్ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేశారు.

చీటింగ్ కేసులో విచారణకు జడ బాల నాగేంద్ర

విశాలాంధ్ర-ఒంగోలు : చీటింగ్ కేసులు జనసేన పార్టీ జిల్లా ప్రచార కార్య దర్శి బాలనాగేంద్రను తాలూకా పోలీసులు విచారణకు తీసుకు వెళ్లారు. రియల్ ఎస్టేట్ కి సంబంధించి డబ్బులు విషయంలో చీటింగ్ చేసారని మండవ వారి పాలెం చెందిన వ్యక్తులు కేసు పెట్టడంతో విచారణకు తాలూకాకి తీసుకువెళ్లారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : పిజిఆర్ఎస్‌లో నమోదయ్యే అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది.మా సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతి పత్రాల ద్వారా కలెక్టర్‌కి విన్నవించారు.177 అర్జీలు నమోదు కాగా,తన పరిధిలో ఉన్న వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపారు.కొన్నిటిని పరిశీలన,మరికొన్నిటిని విచారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు.అర్జీల పరిష్కారంపై ప్రజ సంతృప్తి స్థాయి పెరిగేలా అధికారులు పనిచేయాలని కలెక్టర్ చెప్పారు. పిజిఆర్ఎస్‌పై అధికారులు నిర్లిప్తంగా ఉండరాదన్నారు.ప్రజలు సుభిక్షంగా ఉండడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.22ఎ క్యాటగిరీలో పెండింగ్లో ఉన్న 108 అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఆర్డీవోలకు సూచించారు.సాధారణ బదిలీల్లో అధికారులు పారదర్శకత పాటించాలన్నారు. బాపట్ల జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయరాదన్నారు.ఆ స్థానంలో పొరుగు జిల్లాల నుంచి అదే హోదాలో వచ్చే వారు ఉంటేనే అనుమతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఉప కలెక్టర్ లవన్న, డిఆర్‌డిఏ పిడి శ్రీనివాసరావు,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : ఎస్పీ

విశాలాంధ్ర - ఒంగోలు : ప్రజా పిర్యాదులను పరిష్కారించుటకు సోమవారం జిల్లా ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమమును జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పిర్యాదు దారులు వారి సమస్యల గురించి స్వేచ్ఛగా జిల్లా ఎస్పీకి, పోలీస్ అధికారులకు విన్నవించుకున్నారు. ఎస్పీ పిర్యాదులు గురించి సమగ్రంగా అడిగి తెలు సుకొని, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరి స్తామని భరోసా కల్పించారు.

అందిన ఆయా ఫిర్యాదుల గురించి సంబం ధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ఆయా ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కారించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసు కున్న చర్యలపై నివేదిక కూడా ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కొరకు పోలీసు స్టేషన్లు, కార్యాలయాలకు వచ్చు పిర్యాదుదారులతో పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాదగా వ్యవహరించి చట్ట పరిధిలో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ గారు ఆదేశించారు. ఒంగో లులోని తన ఫ్యాక్టరీకి లోన్ ఇప్పిస్తామని గుంటూ రుకు చెందిన ఒక వ్యక్తి వారి క్రెడిట్ సొసైటీ లిమి టెడ్ అనే పేరు మీద కొంత అమౌంట్ ఫిక్స్ డిపా జిట్ చేస్తే 50% సబ్సిడీ కూడా వస్తుందని నమ్మించి, తన వద్ద నుంచి ఫిక్స్ మరియు ఇతర లోన్ శాంక్షన్ కావటానికి మొత్తం 57 లక్షల రూపా యలు తీసుకొని, తదుపరి తను విచారించుకొని అటువంటి ఏ క్రెడిట్ సొసైటీ లేదని తెలుసుకొని తన వద్ద నుండి డబ్బులు మోసపూరితంగా తీసుకు న్నారని, డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నారని ఒంగోలుకు చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు. తన కుమా రుడుకు విజయవాడ రైల్వే స్టేషన్ లో అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తన వద్ద నుండి అడ్వాన్స్ గా రూ.25,000/- డబ్బులు ఫోన్ పే ద్వారా పేర్నమిట్ట, విజయవాడ చెందిన ముగ్గురు వ్యక్తులు తీసుకొని ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు అడుగుతుంటే ఇవ్వటం లేదని సంతనూతలపాడు మండలానికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డిఎస్పీ సురేష్ బాబు, సిసియస్ ఇన్స్పెక్టర్ జగదీష్, ఒం గోలు ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, డీటీసీ ఇన్స్పెక్టర్ షమీముల్లా, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, యజి పాడు పియస్ ఎస్సై రజియా సుల్తాన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు వేలం కేంద్రాన్ని నేడు జగన్ సందర్శన

విశాలాంధ్ర - వెలిగండ్ల : రాష్ట్ర వ్యాప్తంగా పొగాకు రైతులకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 28వ తేదీ ప్రకాశం జిల్లా పొదిలి వేలం కేంద్రాన్ని రైతులతో కలిసి సందర్శించనున్నారని జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు జిల్లా జడ్పిటి సంఘం అధ్యక్షులు వెలిగండ్ల, జడ్పి టిసి గుంటల తిరపతి రెడ్డి పార్టీ శ్రేణులకు తెలిపారు. సోమవారం మండలం లో వైసిపి కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతులకు భరోసా కల్పించేందుకు పొగాకు వేలం కేంద్రం వద్ద గిట్టుబాటు ధర కల్పిం చాలని రాష్ట్రవ్యాప్తంగా పొగాకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నందున వారికి సరైన ధర ఉండాలనే ఉద్దేశంతో జగనన్న 28వ తేదీ పొదిలి పొగాకు వేలం కేంద్రానికి వస్తున్నందున పొగాకు రైతులు వైసిపి కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీ నర్ గజ్జల వెంకటరెడ్డి, వెలిగండ్ల సర్పంచ్‌లు తాతపూడి సురేష్ బాబు, శ్యా మల కృష్ణారెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, పోల్లా సుబ్రమణ్యం, నారాయణరెడ్డి, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కడప మహానాడును విజయవంతం చేయండి

ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి

విశాలాంధ్ర - వెలిగండ్ల : ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరుగ నున్న మహానాడును విజయవంతం చేయాలని ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి తెలుగుదేశం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమ వారం వెలిగండ్ల టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందమూరి తారక రామా రావు జన్మదినాన్ని గత 43 ఏళ్ల తెదేపా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కడపలో మహానాడును జరుగుతుందని 25 ఏళ్ల తర్వాత ఉమ్మడి కడప జిల్లాలో 10 అసెంబ్లీ స్థానాల్లో 7 తెదేపా కైవసం చేసుకోవడంతో మహానాడు వైభవంగా జరుగుతుందని. తొలిరోజు పార్టీ సంస్థాగత నిర్మాణంపై, రెండో రోజు అభివృద్ధి, ప్రతిపక్షాల వైఫల్యాలపై చర్చ ఉంటుందన్నారు. మూడో రోజు సుమారు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో రాయలసీమ వంటకాలు కూడా ఏర్పాటు చేశారన్నారు. కనిగిరి నియోజకవర్గంలో ఉన్న కార్యకర్తలు, నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో మండల అధ్య క్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, యేరువ చెంచిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి

- కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకము అమలులో స్వయం సహాయక గ్రూపులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి బ్యాంకర్లకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బ్యాంకులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన లక్ష్యాలను పూర్తి చేయుటకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. దిగువ, మధ్య తరగతి నివాస వినియోగదారుల ప్రయోజనం కోసం ఈ పథకమును 13 ఫిబ్రవరి 2024న భారత ప్రధాని ప్రవేశ పెట్టారని ఆయన తెలిపారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా రూ.75, 021 కోట్ల నిధులు కేటాయించారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు 2 కిలో వాట్స్ చొప్పున ఉచితంగా సోలార్ సిస్టం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వీరి ఇంటిపై సోలార్ సిస్టం ఏర్పాటుకు సంబంధించి స్థలం ఇచ్చినందుకు వారికి గవర్నమెంట్ కొంత మొత్తం చెల్లిస్తుందని ఆయన తెలిపారు. ఈ పథకాన్ని రాష్ట్ర మొత్తం అమలు చేయుటకు ముఖ్యమంత్రి లక్ష్యాలను నిర్దేశించారని తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో 10వేల కుటుంబాలకు సోలార్ సిస్టం ఏర్పాటు చేయాలని నిర్దేశించారన్నారు. బాపట్ల జిల్లాకు 60వేల కుటుంబాలకు సోలార్ సిస్టం ఏర్పాటు చేయుటకు నిర్దేశించారని ఆయన తెలిపారు. వీటిని 2027 సంవత్సరం నాటికి పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో డిసెంబర్ నాటికి 47 వేల కనెక్షన్లు ఏర్పాటుకు లక్ష్యాలను నిర్దేశించడమైనదని తెలిపారు. జిల్లాలో ఈ లక్ష్యాలను చేరుకోవడానికి స్వయం సహాయక గ్రూపు సభ్యుల కుటుంబాలకు సోలార్ సిస్టం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడమైనదన్నారు. ప్రతి ఇంటికి 3 కిలో వాట్ సోలార్ ప్లేట్లు అమర్చుటకు నిర్ణయించడమైనదని ఆయన తెలిపారు. ఈ సోలార్ ప్లేట్ల అమర్చుటకు మొత్తం రూ.2 లక్షల పదివేలు ఖర్చు అవుతుందని,అందులో రూ.78 వేలు సబ్సిడీ కింద వస్తుందని, ఇందుకు లబ్ధిదారులు 20 వేలు చెల్లించాలని ఆయన తెలిపారు. బ్యాంకర్లు లోన్ కింద రూ.లక్ష 2 వేలు రుణం మంజూరు చేయాలన్నారు. దరఖాస్తుదారులు చెల్లించ వలసిన రూ.20 వేలను చెల్లిం చుటకు చర్యలు తీసుకోవడమై నదని తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు వచ్చిన తరువాత వాటిని తిరస్కరించకుండా లోన్లు మంజూరు చేయాలని ఆయన బ్యాంకర్స్‌కు సూచించారు. స్వయం సహాయక గ్రూపుల నుండిలోన్ రికవరీ మొత్తం చెల్లించే బాధ్యత మాదేనని ఆయన బ్యాంకులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్.ఈ ఆంజనేయులు, ఎల్ డియం శివకృష్ణ, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

ఫిర్యాదులను చట్టపరిధిలో విచారించాలి

- చీరాల డీఎస్పీ ఎమ్.డి.మోయిన్

విశాలాంధ్ర - బాపట్ల : ఫిర్యాదులను చట్టపరిధిలో విచారించి పరిష్కరించాలని చీరాల డిఎస్పీ ఎమ్.డి.మోయిన్ సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం చీరాల డిఎస్పీ ఎమ్.డి.మోయిన్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీ దారుల వ్రాతపూర్వక అర్జీలను డిఎస్పీ మోయిన్ స్వీకరించారు. వారితో ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను చట్టపరిధిలో పరిష్కరిస్తామని అర్జీదారులకు భరోసా కల్పించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో విచారించి పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు ఇతర పలు సమస్యలపై 59 అర్జీలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిజిఆర్ఎస్ సెల్ ఎస్సై శ్రీనివాసరావు,ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయాలి

- బాపట్ల పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి ఆడే వంశీ

విశాలాంధ్ర - బాపట్ల : కడపలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాపట్ల పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి ఆడే వంశీ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుండి 29 వరకు కడపలో జరుగునున్న మహా నాడు కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సారధ్యంలో బాపట్ల నియోజకవర్గం నుండి టీడీపీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లి మహానాడును జయప్రదం చేద్దామని రాము కోరారు.

బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్లు జైలు శిక్ష

- తీర్పు వెల్లడించిన ప్రత్యేక ఫోక్సో కోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర - బాపట్ల : బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడికి 20 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక ఫోక్సో కోర్టు న్యాయమూర్తి కె. శైలజ సోమవారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకెళ్లితే 2023 నవంబర్‌లో బాపట్ల జిల్లా వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 9వ తరగతి చదువుతున్న 13 సంవత్సరాల మైనర్ బాలికను వారి ఇంటి సమీపంలో ఉండే ముద్దాయి తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు మాయ మాటలతో లోబరుచుకొని అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెపితే చంపేస్తాను అని బెదిరించడంతో జరుగుతున్న దారుణం గురించి ఎవ్వరికీ చెప్పలేదు. బాలిక కడుపునొప్పితో బాధపడుతుండడంతో ఆమె తల్లి స్థానిక ప్రవేటు ఆసుపత్రిలో చూపించగా ఆమె గర్భవతి అని తెలిసింది. జీజీహెచ్ గుంటూరు ఆసుపత్రికి తీసుకుని వెళ్లి చెక్ అప్ చేయించి గర్భవతి అని నిర్ధారించుకుని జరిగిన ఘటన పై 2023 నవంబర్ 17 న వేటపాలెం పోలీస్ స్టేషన్ ఎస్.ఐ జి.సురేష్ పిర్యా దు చేయగా కేసు నమోదు చేశారు.కేసు విచారణ అధికారి అప్పటి చీరాల డిఎస్పీ ఎస్. ప్రసాద రావు నేర స్థలాన్ని సంద ర్శించి, ప్రత్యేక్ష సాక్షులను విచా రించి భౌతిక సాక్ష్యధారాలను సేకరించి ముద్దాయిలు నేరం చేసినట్లు తగిన సాక్షాదారాలతో నిరూ పించి 2023 నవంబర్ 18వ తేదీన ముద్దాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సం బంధిత న్యాయస్థానంలో గతేడాది ఆగష్టు 3వ తేదీన చార్జ్ షీట్ ఫైల్ చేశారు. ప్రత్యేక ఒంగోలు ఫోక్సో కోర్టులో కేసు విచారణకు రాగా వాదోపవాదనలు విన్న ప్రత్యేక ఒంగోలు ఫోక్సో కోర్టు న్యాయమూర్తి కె. శైలజ ముద్దాయికి 20 ఏళ్ళ కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధిస్తు సోమవారం తీర్పు వెలువరించారు. మైనర్ బాలికకు రాష్ట్ర ప్రభుత్వ తరపున 6 లక్షల నగదు పరిహారం చెల్లించే విధంగా ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ బాలికలపై, మహిళల మీద నేరం జరిగితే వేగంగా దర్యాప్తు చేస్తామన్నారు. ఇలాంటి కేసులలో నిందితులకు శిక్షలు పడుతున్నాయన్నారు. కేసు దర్యాప్తు వేగవంతంగా చేసిన పోలీసులను ప్రత్యేకంగా అభినందించారు.

కడపకు తరలిన పసుపు సైన్యం

విశాలాంధ్ర - దర్శి : దర్శిలోని గడియార స్తంభం దగ్గర ఉన్న దారం సుబ్బారావు ఆఫీసులో దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ కడియాల లలిత సాగర్ టిడిపి శ్రేణులతో మహానాడుకు ప్రతి ఒక్కరూ రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దర్శి మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగవేణి - సుబ్బారావు, మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్న, క్లస్టర్లు, టిడిపి నాయకులు కిలారి కొండయ్య, బడే, వెనుబాబు, తెల్లయ్య, నియోజకవర్గంలోని వివిధ హోదాలో ఉన్న ముఖ్య నాయకులు అందరూ పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయాలి

విశాలాంధ్ర- సీఎస్‌పురం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మొదటి సారిగా కడపలో నిర్వహిస్తున్న తెలుగుదేశం మహానాడు కార్యక్రమాన్ని మండలం నుండి ప్రజా ప్రతినిధులు, నాయకులు, టీడీపీ కుటుంబ సభ్యులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని సీఎస్ పురం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తోట చిన్న కోరారు.

ఎమ్మెల్యే కుమార రాజాను సత్కరించిన 'మండవ'

విశాలాంధ్ర - ఒంగోలు : కృష్ణా జిల్లా పామర్రు శాసనసభ్యులు కుమార రాజాను సోమవారం మధ్యాహ్నం కృష్ణా ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవా సమాఖ్య ట్రస్టు రాష్ట్ర అధ్యక్షులు మండవ మురళీకృష్ణ ఘనంగా సత్కరించారు. పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార రాజ మహానాడుకు వెళుతూ మార్గమధ్యంలో ఒంగోలులో ఆంధ్రప్రదేశ్ కమ్మ వారి సేవా సమాఖ్య ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీకృష్ణ నివాసానికి వచ్చారు. గత సంవత్సరం జరిగిన సాధారణ ఎన్నికల్లో మురళీ కృష్ణ తన స్వంత నియోజక వర్గం పామర్రులో తన విజయానికి చేసిన కృషిని మరువలేనిదని అందుకే స్వయంగా కలవటానికి వారి ఇంటికి వచ్చానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండవ మురళీ కృష్ణ కుటుంబ సభ్యులు పామర్రు శాసనసభ్యులు వర్ల కుమారరాజకి ఆతిధ్యం ఇచ్చి అనంతరం సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండవ సుబ్బారావు, దుగ్గినేని వెంకటరావు,నంబూరి శ్రీరాములు, గోగినేని కిషోర్,రాయపాటి జగదీష్ మాదాల రవి , మన్నం అంజయ్య, చుంచు వాసుబాబు తదితరులు ఉన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీలో కార్గో సేవలు

విశాలాంధ్ర - కొమరోలు : కొమరోలులోని వెంకటేశ్వర మీసేవలో ప్రభుత్వ రంగ సంస్థ ఏపీ ఎస్ ఆర్టీసీ గిద్దలూరు డిపో మేనేజర్ చంద్రశేఖరరావు ఏపీఎస్ ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ చంద్రశేఖం'రావు మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలోని కొమరోలు మండలం ప్రధాన రహదారిలోనీ వెంకటేశ్వర మీ సేవలో కార్గో సేవలను ప్రారంభించారు. ఈ సేవల ద్వారా తమ సరుకులను, వస్తువులను, డాక్యుమెంట్ కవర్లను 48 గంటల్లో డిపో ఉన్న అన్ని పట్టణాల్లో గమ్యస్థానానికి చేర వేస్తున్నట్టు తెలిపారు. మహానగరాల్లో, అన్ని జిల్లా కేంద్రా ల్లో ఇంటికే డెలి వరీ చేసే అవకాశం కూడా ఉంది. ఈ సర్వీస్ ద్వారా రైతు లు పండించిన పంటను గుంటూరు, విజయవాడ మార్కాపురం వంటి పట్టణాలకు పంపవచ్చని తెలిపారు.

పి-4 బంగారు కుటుంబానికి సర్వే చేసి ఎంపిక చేయండి : ఎంపీడీవో

విశాలాంధ్ర - యద్దనపూడి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేయాలని తలపెట్టిన పి4 బంగారు కుటుంబం లబ్ధిదారుల ఎంపిక త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వార్తై ఉండాలని వారిని కొందరు ఆర్థిక స్థితిపరమైన పెద్దలు దత్తత తీసుకొని దారిద్ర రేఖకు పైభాగానికి వచ్చే విధంగా వారిని అభివృద్ధి పదంలో నడిపిస్తారని కోసం దారిద్ర రేఖ కొద్దిగా ఉన్న వారిని ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పి 4 బంగారు కుటుంబం సర్వే తో పాటు,పీఎం సూర్య ఘర్ ప్రతి ఒక్క ఇంటికి మేలు పథకం గురించి చర్చించి దాని వివరాలను తెలిపారు. ప్రజా రక్ష పీఎం సూర్య ఘర్ ప్రతి ఇంటికి రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్స్ పెట్టుట ద్వారా 300యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందించబడుతుందని తెలియజేశారు.బీసీ, ఓసీ,కమ్యూనిటీలకు సంబంధించి 3కేవీలు సోలార్ యూనిట్ల కొరకు యూనిట్ కాస్ట్ 2,10,000 లబ్దిదారుని వాటా 20000, సబ్సిడీ 78000,బ్యాంక్ లోన్ 1,12,000 విద్యుత్ శాఖ వారి ద్వారా ఇన్స్టాల్ చేస్తారు.అందరూ బీసీ,ఓసీ,కమ్యూనిటీలు సోలార్ ప్యానల్స్ బిగించుకొనుట ద్వారా ఉచితంగా కరెంటు పొందవచ్చునని, సబ్సిడీ పొందవచ్చున్నారు. కరెంటు బిల్లు, ఇంటి పన్ను పత్రము,ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్ తీసుకోని సచివాలయం వద్దకు గాని ఇంటర్నెట్ వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించు కోవాల్సిందిగా ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కే.రవికుమార్,టిడిపి నాయకులు నల్లపునేని రంగయ్య చౌదరి,కనపర్తి నాగేశ్వరరావు,గుదే తారక రామారావు, రాయపాటి సీతయ్య,కోయ సతీష్, కొరిటాల వంశీకృష్ణ, వజ్జా సుబ్బరామయ్య, కర్లపూడి నారాయణస్వామి,సింగ్ చంద్రశేఖర్, వరదబాబు, దరువూరి వీరయ్య చౌదరి, వంకాయలు పట్టు సుబ్బారావు, ఈరపనేని వాసు, సూరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ, కొండల రాయుడు, సతీష్ పాల్గొన్నారు.